న్నేది. ఇప్పుడిప్పుడే వాడికి మెలకువ వస్తుందని నాకు తెలుసు. ఉత్సాహంగా ఉన్నప్పుడు ఇలా బార్‌కి వెళ్లి ఓ పెగ్ పట్టించడమంటే వాడికో ఆనందం!

అయితే, వేణు అంతలా తప్పతాగుతాడని నేను ఊహించలేదు. ఏనాడూ. వాడు ఇవాళ ఏదో ప్రాణం ఎత్తిపోయినవాడిలా తాగేశాడు. వాడి ధోరణి చూస్తే భయంవేసింది నాకు!

"పద్దు, వేణూ! ఇక చాల్లే. పోదాం పద" అన్నాను.

"లేదురా. నన్ను తాగనీ." సీసాలోని సగం గ్లాసులోకి పోసి గటగటా తాగేశాడు.

"నా మాట విను, వేణూ!"

"ఈ ఒక్కసారికి నన్ను పూర్తిగా తాగనివ్వు, గోపీ!" మాటలు తడబడ్డాయి.

వాడికెప్పుడూ ఇలా కార్చేటంతప్పు నేనేమీ చెయ్యలేకపోయాను. కానీ, మా ఇద్దరిమధ్య ఉన్న స్నేహబంధం నన్ను ఊరుకోనివ్వలేదు. వాడి చెయ్యి నొక్కుతూ అన్నాను: "ఏమయిందని, వేణూ, ఇలా బాధపడుతున్నావు? నాకు చెప్పరాని విషయమా?"

"లేదురా. నీకుతప్ప నేను మరెవరితో చెప్పుకోను? మాట్లాడు నాకు ఆత్మీయుడివి కావా?" మాటల్లో కొంచెం విషాదం కూడిన వ్యంగ్యం తొంగిచూసింది. ఉన్నట్టే నవ్వి అన్నాడు: "నేను మామూలు స్థితిలో ఉన్నప్పుడు నీకేమీ చెప్పలేను. చెప్పడానికి నాకు మనస్సు రాదు."

"దానికి కారణం?..." పెద్దకళ్ళు చేసి అన్నాను.

"నువ్వు నా స్నేహితుడవైపోయావు. ఈ స్నేహంలోనే... ఏదేనా..." పెదాలలో వేరగిలబడి మత్తుగా కళ్లు మూసుకున్నాడు.

చుట్టూ చూశాను. బార్‌లో జనం పలచబడుతున్నారు.

"వేణూ, మనం వచ్చి గంటన్నరపైగా అయింది. ఇక వెళ్లడం శ్రేయస్కరం. లేకపోతే వాళ్లు గెంటుతారేమో! పద, మీ రూముకి పోదాం."

"అవును. మన రూముకు పోదాం. మరి... అక్కడికి ఎలా వస్తుంది ఈ మందు?"

"అవును. నమస్తే!"

పకపకా నవ్వాడు వేణు. "ఓరి వెర్రిమొహమా! అనాత్రం సుఖం తెలీదూ?"

"ఏమిటది?" తెల మొహం వేశాను. వాడినవ్వు అర్థంకాక.

"ఒక బాటిలు కొనుక్కుపోతే పోలా?" మళ్ళీ పకపకా నవ్వాడు.

నాకూ నవ్వు వచ్చింది, వాడి ఆలోచనకు. "సరే, పద" అన్నాను.

ఒక బాటిలు కొనుక్కుని టిక్కాలో రూముకి వచ్చాం. గదిలోకి జొరబడుతూనే బాటిలు తీసుకున్నాడు. దాన్ని టేబిలుమీద పెట్టి అన్నాడు: "ఇఫ్ యు డోంట్ మైండ్. ఆ కూజా పట్టుకురావాలి. నేను లేస్తే అల్లరి అవుతుంది. కూజా విరిగిపోతుంది. అప్పుడు నువ్వు ఏడుస్తావు. నాకు నవ్వు వస్తుంది." పకపకా నవ్వాడు.

అవును. ఆ కూజా పగిలిపోతే ఏడవనూ? మేమిద్దరం ఒకే రూములో ఉన్నప్పుడు ఆ కూజా కొన్నాను. అప్పటినించి ఇంతవరకు ఆ కూజాకు బుజం తీరలేదంటే నేనే కారణం. ఈ రూములో మేమిద్దరం ఉన్నప్పుడు నేనుతప్ప వాడా కూజాను ముట్టుకోడానికి వీల్లేదు. ఆ కూజా సొంపు చూడ ముచ్చటగా ఉంటుంది. లేడిబ్రహ్మ చుట్టూ చక్కటి నగిషీ. దాన్ని అలా చూసుకోడానికి మరో కారణంకూడా ఉంది. నేను బరంపురం వెళ్లి నేసంగిసెలవుల్లో ఆఖరిరోజులు గడిపి వస్తున్నాను. మెయిలు విశాఖపట్టణంలో ఆగింది. నేనెక్కిన కంపార్టుమెంటు పరిగ్గా కూజాల అంగడి ఉన్నచోట ఆగడంతో నా దృష్టి వాటిమీద పడింది. లేడిబ్రహ్మకూజా నన్ను ఆకర్షించింది. దిగి బేరంచేసి ఆ చేతితోనే చన్నీళ్లు నింపి తీసుకువచ్చాను. దాన్ని సీటుకిందపెడుతూంటే ఎవరో అన్నారు: "ఎక్స్యూజ్ మీ... కొంచెం మంచినీళ్లిస్తారా?" కోటవీణలు ఒక్కసారిగా మోగినట్లనిపించింది. వెనక్కితిరిగి చూశాను. కోటవీణల దేవత నా మనస్సులోని వ్యక్తి. నా ఆరాధ్యదేవత. నా మల్లెపువ్వు. లత.

"మీరా?" అంది లత.

"సారీ. నా పేరు మీరాకాదు, రామగోపాలం." సంతోషంతో పొంగిన మొహాన్ని మరింత చేస్తూ అన్నాను.

# లజ్జ

లత కిలకిలా నవ్వింది. "మీరు తమాషాగా మాట్లాడతారు." నోటికి కొంగు అడ్డు పెట్టుకుంది.

"మరే!" అన్నాను చేతులు నలుముకుంటూ. ఆమె అభినందన ఏ జేబులో పెట్టుకుందామా, లేక ఏ పెట్టెల్లో కట్టి కునేగా మరికొళుందు సెంటు చుట్టూ పూసి...

నా ఆలోచనలు పూర్తికాకుండానే అంది నవ్వుతూ, "మీరు కవులా? భావనా ప్రపంచంలో విహరిస్తున్నట్లున్నారు?"

నాకు సిగ్గు ముంచుకువచ్చింది. తల దించుకున్నాను.

"కొంచెం మంచినీళ్లిస్తారూ?"

"మంచినీళ్లా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును."

"మీరు మంచినీళ్లు తాగుతారా? అబ్బే, బాగులేదు. కూల్‌డ్రింక్ తెస్తాను." నాకు అనిపించింది, 'ఆమె మంచినీళ్లు తాగడమేమిటి? అమృతం తాగాలిగానీ' అని.

చిన్నగా నవ్వుతూ అంది లత: "ఇప్పటికి రెండు డ్రింకులు తాగాను. దాహం తీరలేదు."

'దానికి బుద్ధిలేదు' అనుకున్నాను. 'ఒక డ్రింకుకు లేకపోయినా మరో డ్రింకుకేనా ఉండవలసింది' అని కూడా అనుకున్నాను.

**గుమ్మా ప్రసన్నకుమార్**

లేడిబ్రహ్మకూజా తీసి ఇచ్చాను. అప్పుడే కొన్న ప్లాస్టిక్ గ్లాసుకూడా ఇచ్చాను. ఉయ్యాలగా కూజా వంచి, గ్లాసులో నీళ్లు పోసుకుని, తాగి, చక్రాల్లాంటి కళ్లతో కూజాను, గ్లాసును, నన్ను మార్చిమార్చి చూసింది.

"కూజా ఇప్పుడే కొన్నాను. ఎలా ఉంది?" అడిగాను.

"మార్వెలస్! మీది మంచి 'టేస్టు'" అంది మెచ్చుకుంటూ.

నిజానికి ఆ కూజావల్లే తరవాత, తరవాత మా పరిచయం కొంచెం ఎక్కువయి, పొరపాటున ఉత్సాహంతో మరికొంచెం ఎక్కువయి, మోహాదులకూడా మించిపోయి, ప్రణయంలో పడింది. కూజామీది మక్కువతో మా పెళ్లినాడు దాన్ని మామధ్యే పెట్టుకున్నాను, ఎవరేమి అనుకున్నా. మా ఇంట్లో ఉన్న పిల్లలు కోతులు. వాళ్ళకి కూజా కనిపిస్తే బల్లు తాగినట్లు గెంతుతారని, దానికి మావాడి రూములో ప్రశాంత వాతావరణం సృష్టించాను. అదీ కథ.

నేను నా ఆలోచనలో ఉంటుండగానే సీసాలోది సగం ఖాళీచేశాడు. "ఏమిటి, సార్... ఆలోచనా ప్రపంచంలో మునిగి తేలుతున్నారా?" అనవసరంగా పకపకా నవ్వాడు. నాకు కోపం వచ్చింది.

"అలా నవ్వకు!" కసిగా అన్నాను.

"ఏడవమన్నావా?" మత్తుగా, ముద్దమాటలతో అన్నాడు.

"అదే మంచిది!"

నాకు ఈ తాగేవాళ్లమీద సానుభూతి లేదు. మద్యం ఎందుకు తాగుతారు? డబ్బు ఎక్కువగుతున్నదనా? చిన్నచిన్న సమస్యలను కొండంతలు చేసి ఆలోచించడం రెండు సినిమాలు చూసి నేర్చుకున్న సారాంశం—బారుకెళ్లి రెండు పెగ్గులు తాగడం—అనవ్యాం వస్తుంది! అందులో వేణు తాగడంఅంటే మరీనూ!

"మళ్లీనూ." కళ్లు చికిలించాడు. బాటిల్ తీశాడు. గబుక్కున బాటిల్ లాక్కున్నాను. "మరి తాగడానికి వీల్లేదు, వేణూ! నీకంతగా తాగాలనిఉంటే తాగు. కానీ, నేనుండగా కాదు. పొమ్మన్నావా?" గట్టిగా అరిచాను.

"లేదురా, గోపీ. నీకు చాలా సంగతులు చెప్పాలి." లేచినవాళ్లే కూర్చోపెట్టాడు. చేతుల్లోనించి సీసా తీసుకున్నాడు. "చూడు, గోపీ. ఇది నేనుకుంటేనేగాని ఇన్స్పిరేషన్ రాదు. అది చెప్పాలనుకుంటున్నది చెప్పలేను. అది చెబితే గానీ నాలోని బాధ పోదు. ఈ కాస్త వేసుకోనీ." మిగతాది ఏమీ కలుపుకోకుండానే గుటగుటా తాగేశాడు.

"ఏమిటి చెప్పేది?"

తూలుతూనే లేచాడు. మంచంమీద కూలబడ్డాడు.

"చెప్పేముందు చిన్న కోరిక."

కుతూహలంగా చూశాను.

"ఆ గాడ్రెజ్ లాక్ తియ్యి. అది మన గదికి లోపల తాళంవేసి, ఆ తాళంచెవి ఇయ్యి."

"ఎందుకు?" ఆశ్చర్యపోయాను.

"ఇది నా కోరిక అని అన్నానా?" కళ్లు చింతనిప్పుల్లా మెరవడం చూశాను. లేచి తలుపులు గడియపెట్టి తాళంవేసి, తాళంచెవి బల్లమీద పెట్టాను.

“ఇలా ఇష్టమన్నావా?”

గొంతులో కొంచెం ఖేదం కనిపించింది. రాత్రి వైపుని చూస్తే, తాను భయపడిపోయింది. తాళంచెవి అందించాను. అది విసురుగా అందుకుని ఒక్క ఉదుటున నా కాలరు పట్టుకున్నాడు. చెంపదెబ్బలు వాయించి ఒక్క తోపు తోశాడు. ఆ తోపుతో గదిమూలకు వెళ్ళి పడ్డాను. ఏమేం జరుగుతున్నదీ ఆలోచించేలోగా ఇదంతా జరిగిపోయింది. ఇందుకా తాళం వెయ్యమన్నది? తప్పించుకుని పారిపోదామా? అలా తప్పించుకునేందుకు నేనేం తప్పు చేశాను? కోపం వచ్చింది.

“రాస్కెల్!” నోటికి వచ్చినట్టు తిట్టాను.

తిడుతూనే వేణుదగ్గరికి వెళ్ళి కొంచెంభయంగానూ పట్టుకుని గట్టిగా అడిగాను: “ఎవడురా! నిన్ను ఈ స్థితికి పాల్పడచేసింది! ఏమిటది? చెప్పు!”

“పిచ్చివాడిలాగా ఉన్నావా?”


“ఎందుకు?”


“గుండె ఆగి చచ్చిపోతానేమోనని!” కొంతసేపటికి అన్నాడు: “పార్వతి చచ్చిపోయింది” అంటూనే రెండు చేతుల్తోనూ మొహం దాచుకున్నాడు.

నాకు కళ్ళు బైర్లుకమ్మాయి. కాసేపట్టు, గుండె ఆగినంతపనయింది. నిగ్రహించుకుంటూ అడిగాను, “ఎలా, వేణూ, ఎలా?”

“ఆత్మహత్య చేసుకుంది.”

వేణు ఏడుస్తూనే లేచి నా కాలరు పట్టుకుని





# కుళ్ళు లేని కళ్ళు

పైకి లేవదీశాడు. మొహంలో మొహంపెట్టి అన్నాడు: "గోపీ, పార్వతి జీవితంతో చిన్నఆట ఆడావు. అంతేనా?"

వాణ్ణే చూస్తూ ఉండిపోయాను.

దవడ అదిరేటట్లు కొట్టాడు. "చేసిన తప్పు కనీసం ఒప్పుకోవేం?"

నేను వాడికన్నా బలవంతుణ్ణి. కానీ నిస్సత్తువగా ఉండి చెయ్యి ఎత్తలేకపోయాను.

"ఛీ!" వదిలేశాడు. టేబిలుదగ్గరగా నడిచాడు.

"ఉత్తరం చదువుతావా?" నానుండి సమాధానం ఆశించకుండానే ఉత్తరం నామీద పడేటట్లు విసిరాడు. వణికే వేళులతో తీసి చదివాను.

"అన్నయ్యా,

నువ్వు చెప్పినదాంట్లో ఎంత సత్యముందో ఈ నాడు గ్రహించగలిగాను. ఇంతవరకూ గ్రహించలేనందుకు సిగ్గు కూడా కలిగింది.

చి. రామగోపాలానికి చి. సౌ. ప్రేమలతను ఇచ్చి వివాహం.

ఈ శుభలేఖ చూసిన తరవాత నువ్వు కిందటి ఉత్తరాల్లో రాసినవిషయాలన్నీపూర్తిగా అర్థమైనాయి. నేను పూర్తిగా మోసపోయాను, వేణన్నయ్యా! నా పట్టుదలలు, నా మనస్తత్వం నువ్వు గ్రహించే ఉంటావు. మన కుటుంబాలు స్వల్పకారణంగా తగువు లాడుకుని విడిపోవడం మన దురదృష్టం. నీమీద నాకు చిన్నప్పటినుండి ద్వేషం నూరిపోశారు నా తలిదండ్రులు. కనక నువ్వు నాకు శత్రువుగానే నా మనస్సులో నిలిచావు. నువ్వు రాసిన ఉత్తరాలమీద నాకు నమ్మకం చాల్లేదు. అంచేత, నీ మాటలు నమ్మలేదు. నామీది ఓర్వలేనితనంవల్ల అలా రాశావేమోనని అనుకున్నాను. పచ్చని జీవితాన్ని చూసి భగ్గున మండుతున్నావనుకున్నాను. ఈమధ్యనే అమ్మచనిపోయింది. నాన్నదోమాదిరి మనస్తత్వం. అదో పెద్దదెబ్బ నాకు. దానిమీదట ఈ శుభలేఖ చూశాను. నేను నిర్మించుకున్న హార్మ్యాలన్నీ కూలి పోయాయి. ఎవరికోసం బతకను? ఈ వయస్సులో నా హృదయంలో కలిగిన సంచలనాన్ని భరించేశక్తి నాకులేదు వేణన్నయ్యా! ఈ బాధ జీవితాంతం భరించలేను. నాకు బతకాలని లేదు. నీకే ఉత్తరం అందేనాటికి నేనుండను. చి. రామగోపాలంగారిని అడిగానని చెప్పు. నూరేళ్ళు వర్ధిల్లాలి. చచ్చిపోతూ శాపాలు పెట్టడం దేనికి?

నీ చెల్లెలు
పార్వతి."

కళ్ళు తుడుచుకున్నాను.

నావేపు చూస్తూ అన్నాడు: "మగవాడికి అంత ఏడుపు కూడదు."

తాళంచెవి నామీదికి విసిరాడు. "తలుపు తీసుకుని పో. నా దగ్గర ఉండకు. ఈ పిచ్చికోపంలో ఏం చేస్తానో తెలీదు."

నేను లేవలేదు.

"పొమ్మన్నానా?"

"..........."

"పార్వతి ఎవరనుకున్నావు?"

కుతూహలంగా తల ఎత్తాను.

"మా పెద్దనాన్నగారి కూతురు." వస్తున్న ఏడుపును ఆపుకుంటూ అన్నాడు.

"మీ పెద్దనాన్నగారి కూతురా?" అదిరిపోయాను.

"అవును."

". . . . . . . . . . ."

"ఆ ఉత్తరంలో అన్ని సంగతులు చదివావు. మా వెనకచరిత్ర అంతా గమనించే ఉంటావు. ఎందుకో, మా కుటుంబంలో ఆడపిల్లలు లేకపోవడంవల్లనో ఏమో, నాకు పార్వతిఅంటే చిన్నప్పటినుండి అభిమానం. చిన్నవయస్సులోనే ఇద్దరం విడిపోవలసివచ్చింది, పెద్దలమూలంగా. నా మనస్సులోఉన్న భావాన్ని ఎవరు తుడిచిపెట్టగలరు? పార్వతి నా మాటలు నమ్మలేదు. గోతిలో పడిపోయింది. పెద్ద పెద్ద కోరికలు చుట్టూ పడుముకొంది. సౌందర్యసీమలో విహరించింది. కాని, తనతో చెలగాటమాడుతున్నది ఒక పెద్ద విషసర్పమని తెలుసుకోలేకపోయింది. ఆ మైకంలో ఎవరినీ నమ్మలేదు. కాదు - నీలో, నీ ఉత్తరాలలో ఆ మైకం ఉంది. దీన్ని హత్య అని అంటాను. దీనిలో నేను కూడా భాగస్వామినే. ప్రేమలతకుకూడా కొంత భాగముంది. నా ప్రాణస్నేహితుడవని, నిన్ను బాగా అర్థంచేసుకున్నానని అనుకుని భ్రమలో పడ్డాను. ఒకనాడు గర్వించాను. నీ పక్క ఉంటేనే మహాభాగ్యంగా తలిచాను. కాని, ఇప్పుడో? నువ్వు నా పక్కనుంటే..."

తల అడ్డంగా తిప్పుతూ అన్నాడు: "ఉహూ... నా నోరు మంచిదికాదు. తిట్లు వచ్చేస్తున్నాయి."

నేను గొణుక్కున్నది నాకే అర్థం కాలేదు.

హఠాత్తుగా అన్నాడు: "గోపీ, నేను చెప్పే కథ వింటావా? దానిలో నువ్వు, నేను, పార్వతి ఉంటాం. పోతే, లతకుకూడా చిన్న పోర్షన్ ఇస్తాను. ఏం? చెప్పేదా? . . . నీ ఉత్తరాలన్నీ చదివాను. ఆశ్చర్యపోవుగా?"

నాకు నిజంగా ఆశ్చర్యం కలిగింది. కోపం వచ్చింది. "పరాయివాళ్ల ఉత్తరాలు చూడ్డం సిగ్గులేని పని. పైగా చెప్పుకోడమా?"

"ఒరే, గోపీ, నువ్వు మాట్లాడకు. నాకు చెడ్డకోపం వచ్చేస్తుంది. నేను చెప్పేదిమాత్రం వింటూండు."

కసిగా ప్రారంభించాడు, "రామగోపాలంగాడని ఒక గాడిదతో ఒక బుద్ధిలేని చవట స్నేహం చేశాడు." రామగోపాలంగాడు అనేచోట ఒత్తిపలుకుతూ.

* * *

"ఆ మహానుభావుడు కలంస్నేహం మొదలు పెట్టాడు. కలంస్నేహం అంటే వేణుప్రసాద్‌కికూడా సరదా. కాని అది హద్దు మించకూడదనంతవరకే. కలంస్నేహం అనేది విజ్ఞానం పెంపొందించేటందుకే అని వాడి భావన. అందుకే గోపీగాడు కలంస్నేహం చేస్తున్నానని వేణూకి చెప్పినప్పుడు అతను అభ్యంతరం చెప్పలేదు. పైగా తగినంత ప్రోత్సాహం ఇచ్చాడు. కలంస్నేహం అంటే ఎలా ఉండాలో, ఎలాఉంటే ఆదర్శప్రాయంగా ఉంటుందో మొదలైనవి చెప్పాడు.

"ఒకరోజు వేణు అడగకుండానే ఆ గోపీగాడు కలంస్నేహితునినుండి వచ్చిన ఉత్తరాన్ని చూపెట్టాడు. అంతవరకూ వేణూకి గోపీతో కలంస్నేహం చేస్తున్న స్నేహితుని ఊరూ, పేరూ తెలియదు. తెలియ నవసరం లేదని అడగలేదు. ఆ ఉత్తరంకింద "పార్వతి" అని సంతకం ఉండడంతో కుతూహలంగా ఊరుపేరుకూడా చూశాడు. "పార్వతి!" సందేహంలేదు. పార్వతి వేణుకి పెద్దనాన్నకూతురే! అంటే తన చెల్లెలే! ఆ ఉత్తరంలో పార్వతి మొదటిసారిగా తన ప్రేమనూ, అనురాగాన్నీ ఈ రామగోపాలంగాడిమీద వ్యక్తంచేసింది. దానికి తను రాసిన జవాబుకూడా గోపీ చూపెట్టాడు. గోపీ ఉత్తరంలోకూడా ఎక్కడా తిరస్కారభావాలేవీ లేవు. పైగా, అడకూతురు ఇంకా తనవేపు మొగ్గే భావాలున్నాయి. ఆ దౌర్భాగ్యుడు రచయితకూడానూ.

"వేణు హృదయం చెప్పలేని ఆనందంతో డోలలూగింది. ఇద్దరూ దగ్గరివాళ్లే. గోపీ తన ప్రాణస్నేహితుడు. పార్వతి తన చెల్లెలు. రక్తసంబంధీకురాలు. అంతకంటే ఏం కావాలి? ఈ బంధాన్ని మరింత పటిష్ఠం చెయ్యడానికి తగినంత దోహదం ఇచ్చాడు. ఒకరోజు పార్వతి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. కల్లా, కపటం ఎరుగని పార్వతి ఉత్తరం రాసింది. చిన్ననాటి అనుభవాలు, సంఘటనలు మననం చేసుకుంటూ యాదృచ్ఛికంగా ప్రేమలత పేరెత్తి, ఆమె తన చిన్ననాటి స్నేహితురాలనీ, ఇక్కడే ఈ ఊళ్లోనే చదువుకుంటూందనీ, వీలైతే ఒకసారి కలుసుకోమని రాసింది. అదే ఆమెపాలిట మృత్యువుగా పరిణమించింది.

"చంచలమనస్సు కల రామగోపాలం మనసు ప్రేమలత మీదికి మళ్లింది. అంతవరకూ ప్రేమలత చూపుకోసం తాపత్రయపడే అతను, పార్వతి ఉత్తరంమీది నెపంతో కలుసుకుని స్నేహాన్ని అభివృద్ధి చేసుకున్నాడు. పార్వతిని విస్మరించాడు."

వేణు కథలోనుండి వాస్తవికలోకంలోనికి వచ్చాడు. నావేపు చూస్తూ అన్నాడు: "ఆరోజునుండి నువ్వు నాకు ఉత్తరాలు చూపడం మానేశావు. కారణం బోధపడక మొదట తికమకపడ్డాను. తరవాత నిన్ను జాగ్రత్తగా గమనించాను. చాలాచోట్ల నిన్ను, ప్రేమలతను చూశాను. అనుమానం పెరిగింది. నీ ఉత్తరాలు నీకు తెలియకుండా తీసి చదివాను. అర్థమయింది. అప్పుడు నిన్నడిగాను ఏమీ తెలియనట్టు, పార్వతి విషయం ఏమయింది, ఎంతవరకూ వచ్చింది అని. ఏం చెప్పావు నువ్వు? నీ నోటే వినాలని ఉంది." వేణు నాదగ్గరగా వచ్చాడు.

నేను మాట్లాడలేదు.

"నేను అడిగినదానికి నువ్విచ్చిన ఉపన్యాసం ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. 'వేణూ! ఎంత వెర్రివాడవురా నువ్వు? ప్రపంచాన్ని అర్థం చేసుకోలేం? బతికినంతకాలం శుభ్రంగా, ఆనందంగా గడపాలోయ్! ఒక అమ్మాయికి ఉత్తరాలు రాస్తున్నానంటే ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవాలని ఎక్కడుంది? అలాంటి అనుభవం ప్రతివాడికి ఉండాలని నా ఉద్దేశం. అదో ఆటనుకో. లేకపోతే ఏమిటిరా? పరాయి మగాడికి, అందులో ముక్కు మొహం తెలియనివాడికి ఒక అమ్మాయి ఉత్తరం రాసిందంటే, తనకుతానే ముందుగా ప్రేమనూ, అనురాగాన్నీ వ్యక్తంచేసిందంటే, ఎంత తెగింపు ఉండాలి? ఎంత సాహసం ఉండాలి? గతచరిత్ర ఎంత హీనంగా లేకపోతే అలాటి ఉత్తరాలు రాస్తుంది?' అప్పుడు అనుకున్నాను నేను. ఇలాంటి గోముఖవ్యాఘ్రంతో స్నేహం చేశానా? నువ్వంటే అసహ్యం కలిగింది. నీకు నచ్చచెబుదామన్నా వినే స్థితిలో లేవు. నీకు చెప్పి లాభంలేదు. నీలాంటి మూర్ఖుడికి చెప్పేదేమిటి? అసలు నువ్వు పార్వతికి తగినవాడవు కావు. అందుచేత పార్వతిని రక్షించడం నా కర్తవ్యంగా భావించాను. ఆమెకు ఉత్తరాలు రాశాను. నీ ప్రవర్తనా, నీ నిజాయితీ ఉన్నది ఉన్నట్లు రాశాను. కానీ, పార్వతి నన్ను నమ్మలేదు. ప్రేమలతకు చెప్పి చూశాను, 'నీ స్నేహితురాలు ఇలాంటి పరిస్థితులలో ఉన్న'దని. ఇద్దరు కిద్దరే. ప్రేమలత నవ్వి ఊరుకుంది. నాకు పిచ్చెక్కిపోయింది. నేను చేసిన ప్రయత్నం అంతా వృథా అయింది. పార్వతి చచ్చిపోయింది. నిజం తెలుసుకుని బతకలేక, బతకడానికి ఇష్టంలేక చచ్చిపోయింది."

ఇంకా దగ్గిరికి వచ్చాడు వేణు. "ఇప్పుడు చెప్పు. నీదే తప్పు కదూ? నువ్వే హత్య చేశావు కదూ!" చెయ్యి పట్టుకున్నాడు. గబుక్కున తన చెయ్యి వెనక్కి తీసుకున్నాడు. "నిన్ను ముట్టుకోడానికి అసహ్యం వేస్తూంది, గోపీ. గో అవుట్. ఇక్కడ ఉండకు. ప్రేమలతకు ఈ విషయం చెప్పు. పెళ్లి సంబరంగ చేసుకోండి." ఆయాసంతో కళ్లు మూసుకుని మంచం మీద పడుకున్నాడు.

మెల్లిగా తల ఎత్తాను. "వేణూ!" పిలిచాను.

కళ్లు తెరవకుండానే అన్నాడు: "ఏం?"

"నన్ను క్షమించలేవా?"

"నాతో నాలుగేళ్ల సాహచర్యంలో ఉండీ, నన్ను అర్థం చేసుకునే ఈ మాట అంటున్నావా? క్షమించలేను."

"అంతేనన్నమాట!"

"అన్నమాటేగా? రావ్. రాకో!" నవ్వాడు.

"పోనీ, ఒక్క మాటడుగుతాను. జవాబు చెప్పు."

"ఏమిటది?"

"నేనలా ప్రవర్తించినప్పుడు ఒక్కసారేనా పార్వతి నా చెల్లెలని ఎందుకు చెప్పలేదు?"

"చెబితే ఏం చేసేవాడివి?"

"పార్వతి బతికేదేమో!"

"ప్రేమలత మాటేమిటి? ఆమెను హత్య చేసేవాడివా?"

తలుపు తెరుచుకుని బయటకు నడిచాను. ★


## తెల్లమచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా ఇవ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya,
(A.V.) P.O. Katrisarai (Gaya).